మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## గజ్వేల్‌లో బిఆర్ఎస్ జెండా ఎగరేస్తాం : ఎమ్మెల్సీ


ఓటుహక్కును వినియోగించుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి దంపతులు

**గజ్వేల్, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో బిఆర్ఎస్ జెండా ఎగరేస్తామని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సతీ మణి వంటేరు రమాదేవితో కలిసి సాయి జిడిఆర్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో అత్యధిక స్థానాలను బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు గత పది సంవత్సరాలలో చేసిన అభివృద్ధియే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కారణం కానుందని తెలిపారు. 20 వార్డులలో బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## గజ్వేల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం


ఓటుహక్కును వినియోగించుకున్న సాజిద్‌బేగ్

**గజ్వేల్, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి సాజిద్‌బేగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.వాహిద్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న సంక్షేమమే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి కాంగ్రెస్ పార్టీ తరపున నిలబడ్డ అభ్యర్థులకు ఓట్లు వేశారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారివెంట ఇందిరమ్మ కమిటీ సభ్యులు అతాఉల్లాబేగ్, నాయకులు ముజామిల్, ముబషీర్ పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి

## ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి : మంత్రి పొన్నం

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** పట్టణంలోని నవ భారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది అత్యంత శక్తి వంతమైన ఆయుధమన్నారు. ప్రతి ఓటరు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 90 శాతం ఓటర్లు ఓటు వేస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో మాత్రం అవగాహన కొంత తక్కువగా ఉందని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్‌ల పరిధిలోని అర్బన్ ఓటర్లందరూ ఓటు విలువ తెలుసుకుని ఓటు వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే తీరును ఆదర్శంగా తీసుకుని, పట్టణాభివృద్ధి కోసం అర్బన్ ఓటర్లు విచక్షణతో ఓటు హక్కు వినియోగించి ప్రజాస్వామ్యాన్ని బలపరచాలని సూచించారు. ఓటు వేయకుంటే జీవించి ఉన్నట్టే కాదని గ్రామీణ ప్రాంతాల్లో నానుడి సామెత ఉందని గుర్తు చేశారు. పట్టణ ప్రాంతాల్లో వ్యక్తిగత పనులు ఉన్నప్పటికీ కొంత సమయం కేటాయించి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని, అర్బన్ ప్రాంతాల్లో అధిక ఓటింగ్ శాతం నమోదవడం ప్రజాస్వామ్యానికి నిదర్శనమవుతుందని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో మెజార్టీ మున్సిపాలిటీలు కాంగ్రెస్ కైవసం

### వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ


ఓటుహక్కును వినియోగించుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మెజార్టీ మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం అందోలు-జోగిపేట మున్సిపాలిటీకి సంబంధించి తొమ్మిదో వార్డులో ఉన్న తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. జోగిపేటలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్‌బూత్‌లో ఆయన తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజాసంక్షేమంకోసం తమ ప్రభుత్వ పాలనాతీరుకు ప్రజలు పట్టం కడుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ మున్సిపాలిటీలను తామే కైవసం చేసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మీద ప్రలకు ఉన్న నమ్మకం, తాముచేస్తున్న అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయని, అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందన్నారు.

## రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ నుంచి సాగునీటిని వెంటనే విడుదల చేయాలి

### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
సాగునీటి కోసం రైతులు ఆందోళన చెందుతు న్నారని వెంటనే రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ నుంచి నీటి విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆదేశించారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోగల రంగనాయకసాగర్ ఇరిగేషన్ కార్యాలయంలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులతో బుధవారం రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ నీటి విడుదలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగనాయకసాగర్ కాలువ కెనాల్‌లో పేరుకు పోయిన తుంగ,గడ్డిని వెంటనే తొలగించాలన్నారు. ఈనెల 13న రంగనాయకసాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశిం చారు. మూడు నెలల్లో చంద్లాపూర్ లిఫ్ట్ పనులు పూర్తిచేసి ప్రారంభించాలన్నారు. ఇర్కోడు లిఫ్ట్ పనులు త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. గోపులాపూర్, కస్తూరిపల్లి గ్రామాలవద్ద నిర్మించే చెక్‌డ్యామ్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. అల్లీపూర్ గ్రామంలో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అల్లీపూర్ గ్రామంలోని కర్ణాలకుంటకు నీళ్లు రావడానికి ఫారెస్ట్ నుంచి అనుమతి ఇవ్వక ఐదేళ్ల నుంచి నీళ్లు రావడం లేదని గ్రామస్తులు విన్న వించారని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి అల్లీపూర్ కర్ణాలకుంటకు నీళ్లు వచ్చేల లిఫ్ట్ ఏర్పాటు చేయాల న్నారు. అందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ అధికారులు, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.
అనం తరం నియోజకవర్గం లోని ఇరిగేషన్ పెండింగ్ పను లపై హరీష్‌రావు ఇరిగేషన్ అధికారులతో సమీక్షించి పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశిం చారు. యాసంగి పంటకు రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నంగునూర్ మండల ఘనపూర్ పంపు హౌస్ పనులు పూర్తి చేయాలన్నారు.


ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న హరీష్‌రావు

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**దుబ్బాకలో 85.05 శాతం**
**గజ్వేల్‌లో 79.35 శాతం**
**హుస్నాబాద్‌లో 84.21 శాతం**
**చేర్యాలలో 83.41 శాతం పోలింగ్**



**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
సిద్దిపేటజిల్లాలోని చేర్యాల, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్ మున్సిపాలిటీలకు బుధవారం బ్యాలెట్ ద్వారా నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా మున్సిపాలిటీ లలోని పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్టమైన బందో బస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లోని 72 వార్డులకు గానూ 176 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు పోలింగ్ నిర్వహించారు. ఆయా మున్సిపాలిటీలలో ఓటర్లు ఉత్సహంగా పాల్గొని తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 18 రూట్లుగా విభజించి 22 మంది జోనల్ అధికారులను నియమించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ చేశారు. 31 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో 31 మంది మైక్రో పరిశీలకులను ఏర్పాటు చేశారు. 72 వార్డులకు గానూ 326 మంది అభ్యర్థులు తలపడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్దులకు, వికలాంగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. 1069 మంది సిబ్బంది పోలింగ్ నిర్వహణలో పాల్గొన్నారు. దుబ్బాకలో 21341 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా 85,05 శాతం ఓటింగ్‌లో పాల్గొన్నారు. చేర్యాల మున్సిపాలిటీలో 13777 మంది ఓటర్లుకు గానూ 83.41 శాతం పోలింగ్‌లో పాల్గొన్నారు. గజ్వేల్‌లో 46740 మంది ఓటర్లు ఉండగా 79.35 శాతం ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. హుస్నాబాద్‌లో 19,227 మంది ఓటర్లు ఉండగా 84.21 శాతం పోలింగ్‌లో పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి ఆయా మున్సిపాలిటీలో పర్యటించి ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలించారు.కాగా హుస్నాబాద్ మంత్రి పొన్నం ప్రభాకర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గజ్వేల్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**స్ట్రాంగ్‌రూంలకు తరలించిన బ్యాలెట్ బాక్స్‌లు**
జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలలో బ్యాలెట్ ద్వారా నిర్వహించిన పోలింగ్ బాక్స్‌లకు లాక్ వేసి సీల్ చేసి పటిష్టమైన బందోబస్తు ద్వారా స్ట్రాంగ్ రూంలకు తరలించారు.హుస్నాబాద్ మున్సిపాలిటీ పోలింగ్ బ్యాక్స్‌లను మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు తరలించారు. చేర్యాల బ్యాలెట్ బాక్స్‌లను గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసి స్ట్రాంగ్‌కు రూం, దుబ్బాక బ్యాలెట్ బాక్స్‌లను లచ్చపేట మోడల్ స్కూల్ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించారు.గజ్వేల్ బ్యాలెట్ బాక్స్‌లను బాలికల విద్య హబ్‌కు తరలించారు. ఆయా స్ట్రాంగ్ రూంలలో బ్యాలెట్ బాక్స్‌లను పోలీసు బందోబస్తు మధ్య భద్రపర్చారు.


ఎన్నికల కేంద్రాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్ దశరథ్

## గుమ్మడిదల మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతం

### 81.6 శాతం పోలింగ్ నమోదు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త):** నూతనంగా ఏర్పాటు చేసిన గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులకు బుధవారం నిర్వహిం న పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తరలివచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. 81.6 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కొన్నిచోట్ల స్వల్ప సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి పరిస్థితిని చాకచక్యంగా నియంత్రించారు. ఎక్కడా పెద్దఎత్తున అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా పోలీసులు,ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేశారు. మున్సిపల్ కమిషనర్ దశరథ్ పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తూ, అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న అధికారులు, పోలీస్ సిబ్బంది, సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగా గుమ్మడిదల మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. పోలింగ్ శాతం అధికంగా నమోదవడం ప్రజాస్వామ్యంపై ఓటర్ల విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది.

## మున్సిపల్ ఎన్నికల్లో భారీగా పోలైన ఓట్లు

### ఇస్నాపూర్‌లో 80.55.. ఇంద్రేశంలో 84.84

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు. ఇందుకు పోలైన ఓట్ల శాతం చుస్తే తెలుస్తోంది. ఉదయం 7 గంటల నుంచే ఓటు హక్కు వినియోగించేందుకునేందుకు ఉత్సాహం చూపారు. వివిధ పార్టీల నాయకులు ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చి వెళ్లారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం పోలింగ్ కేంద్రం ఉన్న యూపీఎస్ స్కూల్ వద్ద 6వ వార్డు నుంచి పోటీలో ఉన్న బండి హరి శంకర్ ముదిరాజ్ తో కొద్ది సేపు పోలీసులు వాగ్వాదం చేశారు. వికలాంగ ఓటర్లను ఆయన దగ్గరుండి పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకు వెళుతుండటంతో పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీంతో కొద్ది సేపు పోలీసులతో వాగ్వాదం జరిగింది. మొత్తం మీద పోలింగ్ అన్ని కేంద్రాలలో ప్రశాంతంగా ముగిసింది. సైబరాబాద్ డిఎస్పీ ఉదయ్ కుమార్ బచ్చుగూడా పోలింగ్ కేంద్రం సందర్శించారు. అక్కడే విధి నిర్వహణలో ఉన్న పటాన్ చెరు ఎస్ఐ విద్యా చరణ్ రెడ్డి కి తగు సూచనలు చేశారు. మండలం లోని ఇంద్రేశం మున్సిపల్ ఎన్నికల్లో 80.55 ఓట్లు పోలవ్వగా, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 84.84 ఓట్లు పొలయ్యాయి.

**జిన్నారంలో 90.98, గడ్డపోతారంలో 86.08 శాతం పోలింగ్**
**పటాన్‌చెరు, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం, గడ్డపోతారం మున్సిపాలిటీల్లో రెండో సాధారణ పురపాలక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రెండు ప్రాంతాల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొనడంతో అధిక శాతం పోలింగ్ నమోదైంది. జిన్నారం మున్సిపాలిటీలో మొత్తం ఓటర్లు 12,475 మంది ఉండగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఈ సమయంలో 11,350 ఓట్లు పోలవ్వగా 90.98 శాతం పోలింగ్ నమోదైంది. గడ్డపోతారం మున్సిపాలిటీలో సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో మొత్తం 10,315 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 5,334 ఓట్లు ఒక వర్గానికి, 4,981 ఓట్లు మరో వర్గానికి నమోదయ్యాయి. మొత్తం పోలింగ్ శాతం 86.08గా నమోదైంది. పోలింగ్ వివరాలను ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు తిరుపతి వెంకటరామయ్య, వెల్లడించారు.

## సదాశివపేటలో 80 శాతం దాటిన పోలింగ్..

**సదాశివపేట, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త):** సదాశివపేటలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 80 శాతం పోలింగ్ దాటింది. ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్. 13వ వార్డులో మీడియాన పోలీసులు అనుమతించలేదు. ఎన్నికల అధికారి సూచనతో అనుమతించారు. 14వ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి దొంగ ఓట్లు వేయిస్తున్నాడని ప్రత్యర్థుల ఆరోపించారు. 19వ వార్డులో అత్యల్పంగా 72 ఓటింగ్ నమోదు కాగా 25వ వార్డులో 90 నమోదు జరిగింది. మొత్తం 36982 ఓట్లకు గాను 29151 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు 26 వార్డులలో కలిపి మొత్తం 78.82 ప్రజలు ఓటుహక్కు వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్ శివాజీ తెలిపారు.

**జహీరాబాద్‌లో 72.26 శాతం...**
**జహీరాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికలు బుధవారం చెదురుమదురు సంఘటనలు మినహా ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మున్సిపల్‌పరిధి లోని 37వార్డులలో 78,819 మంది ఓటర్లు ఉండగా 56,957 మంది ఓటర్లు (72.26 శాతం) ఓటుహక్కును వినియోగించుకున్నారని మున్సిపల్ కమిషనర్ జైత్రం తెలిపారు. 29090 మంది పురుషులు, 27867 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను పెంచడంతో ఓట్లు వేసేందుకు ఓటర్లు ఇబ్బందులుపడలేదని తెలుస్తోంది. ఎన్నికల ప్రశాంతంగా సాగేలా డిఎస్పి సైదానాయక్ ఆధ్వర్యంలో పట్టణ సిఐ శివలింగం, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తును నిర్వహించారు. మున్సిపల్ ఎన్నిక లు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, పోలీ సులు ఊపిరిపీల్చుకున్నారు.

**అంబులెన్స్‌లో వచ్చి ఓటేసిన మహిళ...**
పట్టణంలోని 23వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటుచేసిన పోలింగ్‌కేంద్రానికి అనా రోగ్యంతో అవస్థలుపడుతున్న ఓమహిళ అంబులెన్స్‌లో వచ్చి వాహనం దిగి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటువేసే అవకాశం లేకపోవడంతో అధికా రులు అంబులెన్స్‌లోనే ఓటుహక్కును సద్విని యోగం చేసుకునేలాగా చర్యలుతీసుకున్నారు. అం బులెన్స్‌లో వచ్చి ఓటువేసి, ఆ మహిళ అందరికీ ఆదర్శంగా నిలిచింది.

## కోహీర్ మున్సిపాలిటీలో 75.36 శాతం ఓటింగ్...

కోహీర్ మున్సిపాలిటీలోని 16వార్డులలో బుధ వారం మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగి సాయి. 16వార్డులకు జరిగిన ఎన్నికల్లో 10837 ఓటర్లలో 8136మంది ఓటర్లు (75.36శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నెల 13న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పా టు చేసిన కౌంటింగ్‌కేంద్రంలో ఓట్లను లెక్కిం చేందుకు అధికారులు సన్నహాలు చేస్తున్నారు.


23వ వార్డులో అంబులెన్స్‌లో ఓటు వేస్తున్న మహిళ

# మెదక్ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతం

* మెదక్‌లో 80.75 శాతం
* నర్సాపూర్‌లో 73.61 శాతం
* రామాయంపేటలో 84.84 శాతం
* తూప్రాన్‌లో 81.30 శాతం
* జిల్లా వ్యాప్తంగా 81.09 శాతం పోలింగ్



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలోని నాలుగు మున్సిపల్‌లో బుధవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సరళి గంట గంటకు పెరుగుతూ వచ్చింది. మెదటి గంటలోనే 13 శాతం పోలింగ్ నమోదైంది. మెదక్,నర్సాపూర్ మున్సిపల్‌లో చిన్న చిన్న సంఘటనలు మినహా అన్నిచోట్ల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. మెదక్‌లో 32 వార్డుల్లో 37045 మంది ఓటర్లు ఉండగా నర్సాపూర్‌లో 15 వార్డుల్లో 16531 మంది ఓటర్లు, రామాయంపేటలో 12 వార్డుల్లో 13112 మంది ఓటర్లు తూప్రాన్‌లో 16 వార్డుల్లో 20427 మంది ఓటర్లు ఉన్నారు.

**ఎన్నికల సరళిని పరిశీలించిన కలెక్టర్**
మెదక్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సరళిని కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ పర్యవేక్షి ంచారు. శాంతి భద్రతకు విఘాతం కలగకుండా ప్రతిష్టమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు.ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు ఎన్నికల సమాచారాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు తెలియచేశారు.

**గంట గంటకు పెరిగిన పోలింగ్...**
ఉదయం 7 గంటలకు ప్రారంభం అయినా పోలింగ్ గంట గంటకు పెరుగుతూ వచ్చింది. మెదటి రెండు గంటల్లో 9 వరకు మెదక్‌లో 13.40 శాతం, రామాయంపేటలో 14.65 శాతం, నర్సాపూర్‌లో 13.37 శాతం, తూప్రాన్‌లో 13.65 శాతం నమోదైంది. అలాగే ఉదయం 11 గంటల వరకు మెదక్‌లో 35.64 శాతం, రామాయంపేటలో 38.27 శాతం, నర్సాపూర్‌లో 34.09శాతం, తూప్రాన్‌లో 35.94 శాతం, కాగా మధ్యాహ్నం 1 గంటలకు మెదక్ లో 58.84 శాతం రామాయంపేటలో 60.79 శాతం, నర్సాపూర్‌లో 55.93 శాతం, తూప్రాన్ లో 57.7 శాతం కాగా మధ్యాహ్నం 3 గంటలకు మెదక్‌లో 71.31 శాతం, రామాయంపేటపేటలో 76.11 శాతం, నర్సాపూర్‌లో 69.10 శాతం, తూప్రాన్‌లో 71.50 శాతం నమోదు అయింది. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి మెదక్‌లో 80.75 శాతం, నర్సాపూర్‌లో 73.61 శాతం, రామాయంపేటలో 84.84 శాతం,తూప్రాన్‌లో 81.30 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 81.09 శాతంగా పోలింగ్ నమోదైంది.

**భారీ బందోబస్తు మధ్య పోలింగ్...**
మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన భారీ బందోబస్తును పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షి ంచారు.

## హంగ్ దిశగా జహీరాబాద్ మున్సిపాలిటీ

### -పోటీ పోటీగా కాంగ్రెస్, బిఆర్ఎస్

### -చైర్మన్ ఎన్నికలో కీలకంగా మారనున్న బిజెపి, ఎంఐఎం

**జహీరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపాలిటీకి బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీకి (కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం) పూర్తిస్థాయిలో మ్యాజిక్ ఫిగర్ సీట్లు వచ్చే అవకాశాలు లేన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ పరిధిలోని 37 వార్డులలో బిఆర్ఎస్‌కు 15 నుంచి 18 స్థానాలు, కాంగ్రెస్ పార్టీకి 12 నుంచి 16 స్థానాలు దక్కే అవకాశాలు ఉన్నట్లు, 3 స్థానాల్లో బిజెపి, 2స్థానాల్లో ఎంఐఎం, 2 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో బిజెపి, ఎంఐఎం, స్వతంత్ర అభ్యర్థులు కీలకంగా మారనున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు రెండు రోజులు అన్ని వార్డులలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు, అభ్యర్థులు డబ్బులు పంపిణీ చేసినట్లు పట్టణంలో గుసగుసలు మొదలయ్యాయి. డబ్బులు తీసుకున్న ప్రజలు తమ తమకు ఓటు వేశారో లేదో అని అభ్యర్థులు తికమకపడుతున్నారు. ఈ నెల 13న జరగనున్న కౌంటింగ్‌లో పార్టీల బలాబలాలు బయటపడనున్నాయి. అంత వరకు అభ్యర్థులు, నాయకులు, ప్రజలు నరాలను బిగపట్టుకుని వేచి చూడక తప్పదు.

# అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో పోలింగ్ ప్రశాంతం

### -79.40శాతం పోలింగ్ నమోదు



వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఓటుహక్కును వినియోగించుకునేందుకు క్యూలో నిల్చున్న మహిళలు

**జోగిపేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**
అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం జరిగిన పోలింగ్‌కు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటల నుంచే ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. ఉదయం మొదటి రెండుగంటలు కొంత మందకొడిగానే ఓటింగ్‌శాతం నమోదు అయిన ప్పటికీ ఓటింగ్ సమయం ముగిసే సమయానికి ఓటింగ్‌శాతం పెరిగింది. మొత్తం 79.40శాతం ఓటింగ్ నమోదైంది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 20 వార్డులుండగా 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయటంతో పాటు, వృద్ధులు, వికలాంగులు ఓటు వేయడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు వీల్‌ఛైర్ తది తరాలను ఏర్పాటు చేశారు. స్థానిక ఎన్నికలు కా వటంతో ఓటుహక్కును వినియోగించుకోవడానికి చాలామంది ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు సైతం వచ్చి మరీ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 16,460 ఓటర్లుండగా ఇందులో 13,061మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాగా జోగిపేటలోని సిపిఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటుహక్కును వినియోగించుకునేందుకు వచ్చిన వ్యక్తిని పోలీసులు తోసేయటంతో 11వ వార్డుకుచెందిన ఓ మహిళా ఓటరు పోలీసులతో వివాదానికి దిగింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు వస్తే పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరిగాలేదని, కొద్దిసేపు ఆమె పోలీసులను నిలదీసింది. ఇదిలా ఉండగా జోగిపేటలోని ఎంపిడివో కార్యాలయంలో ఉదయం సబ్‌కలెక్టర్ పోలింగ్ సరళిని పరిశీలించడానికి వచ్చిన క్రమంలో, ఆ న్యూస్ కవరేజ్ చేయడానికి వెళ్లిన అందోలు నియోజకవర్గం జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు గాజుల పవన్‌ను ఓ కాని స్టేబుల్ అడ్డుకున్నారని జోగిపేట సిఐకి ఫోన్‌లో జరిగిన విషయాన్ని వివరించినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## మహాశివరాత్రికి వివేక్ నగర్ ఆంజనేయస్వామి సిద్ధం


వివరాలు వెల్లడిస్తున్న వివేక్ నగర్ ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాదం

**చిక్కడపల్లి ఫిబ్రవరి 11 ( ప్రభాతవార్త ) :** మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని వివేక్ నగర్ ఆంజనేయస్వామి దేవస్థానములో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాదం బుధవారం వివరించారు. పదిహేనవ తేదీన ఉదయం ఆరు గంటలకు మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకములు, ఉదయం తొమిదిన్నర నుండి ఒంటిగంట ముప్పై వరకు ఏకవార రుద్రాభిషేకములు, సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి ఎనిమిదిన్నర ఏకవార రుద్రాభిషేకములు, రాత్రి పది గంటలకు సామూహికంగా మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకములు ఉంటాయని వివరించారు. రాత్రి ఒంటి గంటకు శివపార్వతుల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించబడుతుందన్నారు. భక్తులందరూ ఈ విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీవతి శర్మ,ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ చెల్లించాలి : జిల్లపల్లి అంజి

**సైఫాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** ఇంజనీరింగ్, ఎంబిఎ, ఎంసిఎ, పిజీ, డిగ్రీ కోర్సులు చేసే లక్షలాది మంది విద్యార్థులకు తక్షణమే 8 వేల కోట్ల ఫీజుల బకాయిల చెల్లించాలని బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజీ డిమాండ్ చేశారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు పై చదువులకు వెళ్ళాలంటే ప్రభుత్వం నుంచి ఫీజులు పెండింగ్‌లో ఉండటం వల్ల కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. దీంతో అనేక మంది విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే ప్రభుత్వం ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి విద్యార్థులను అదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### 14న 'తెలంగాణ జాతిపిత కెసిఆర్' అనే అంశంపై వ్యాస రచన పోటీలు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

**సైఫాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 14న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని బిఆర్ఎస్ నాయకుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం నిజాం కళాశాల ప్రాంగణంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కెసిఆర్ చేసిన పోరాట పటిమపై 'తెలంగాణ జాతిపిత కెసిఆర్' అనే అంశంపై పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలను గోషామహల్ ని యోజకవర్గంతోపాటు నగరంలోని ప్రధానమైన స్కూల్స్, కాలేజీల లో ఈ పోటీలు 14న నిర్వహిస్తున్నామని, ప్రతి స్కూల్, కాలేజీలో ఉత్తమ వ్యాస రచనకు 5వేలు నగదు పురస్కారం అందజేస్తామన్నారు.

### సుదీర్ఘ కార్మిక పోరాట పటిమ కలిగిన వ్యక్తి సుంకరి మల్లేశం

**...హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ**


సుంకరి మల్లేశంను సత్కరిస్తున్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త ) :** సుదీర్ఘ కార్మిక పోరాట పటిమ కలిగిన వ్యక్తి బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సుంకరి మల్లేశం అని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం రాంనగర్ లో బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బి ఎం ఎస్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై న సుంకరి మల్లేశంను బండారు దత్తాత్రేయ సత్కరించి ప్రసంగిం చారు. మల్లేశం సుదీర్ఘ కార్మిక పోరాట పటిమను కొనియాడారు. తన వృత్తి జీవితాన్ని ఐడీపీఎల్ లో ప్రారంభించి, నాటి నుండి కార్మికుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేశారు. బీఎంఎస్ లో వివిధ కీలక బాధ్యతలు చేపట్టి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కార్మికోద్యమాన్ని బలోపేతం చేయడంలో ఆయన పోషించిన పాత్ర అమోఘం" అని పేర్కొన్నారు. సుంకరి మల్లేశం సారథ్యంలో భార తీయ మజ్దూర్ సంఘ్ దేశవ్యాప్తంగా మరింత బలోపేతం కావాలని, వారి పదవీకాలం దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించారు.

## రూ.32 కోట్లతో కాచిగూడ డివిజన్ అభివృద్ధి

**: మాజీ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్**


మీడియాతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్

**కాచిగూడ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

గత ఐదు సంవత్సరాల కార్పొరేటర్ పాలనలో కాచిగూడ డివిజన్ లో రూ.32 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు బీజేపీ డివిజన్ మాజీ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. నింబోలి అడ్డలోని బీజేపీ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆమె డివిజన్ అభివృద్ధి కోసం మరో రూ.5 కోట్ల ప్రాజెక్ట్ ప్రతిపాదనలు అధికారులకు, ప్రభుత్వానికి పంపామని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని నారాయణగూడ చౌరస్తాలో మోడల్ మార్కెట్ నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే మార్కెట్ ప్రారంభించి ప్రజలకు, వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులను కోరారు. బీజేపీ సికింద్రాబాద్ ఎంపీ, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతోందని చెప్పారు. ప్రజలకు ముఖ్యంగా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మంచినీటి, డ్రైనేజీ, వర్షపునీటి పైపులైన్ల నిర్మాణం, అవసరమైన చోట్ల పవర్ బోర్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఐదు సంవత్సరాలుగా తనకు సహకరించిన ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించే అవకాశం ప్రజలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుభాష్ పటేల్, కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు తంగెడిపల్లి బల్వీర్, ప్రధాన కార్యదర్శి ఆర్. సంతోష్, శ్రీరాం సాయికుమార్, వాసు, బి.భీమారాజ్, ఎస్.రవియాదవ్, ఎస్.అరవింద్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# చేయి తడిపితేనే ఫైలు కదలిక..!

**-అవినీతికి కేరాఫ్ కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ కార్యాలయం..**

**-నిర్మాణాలకు అనుమతులు, ఆక్యూపెన్సీకి రూ.లక్షల్లో మామూళ్ళు..**



జోనల్ కార్యాలయం

**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, జనవరి11ప్రభాతవవార్త:** కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ కార్యాలయం అవినీతికి , అక్రమార్జనకు నిలయంగా మారింది. ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ అధికారి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. రూ. లక్షలు ఖర్చుపెట్టి ఇక్కడ సీటు దక్కించుకున్న సదరు అధికారి వడ్డీతో సహా సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకుని అక్రమార్జనలో కొత్త పుంతలు తొక్కుతూ రూ.కోట్ల మామూళ్ళను తన జేబుల్లో వేసుకుంటున్నట్లు ఆరోపణలు వున్నాయి. అక్రమాలతో రూ.కోట్ల ఆస్తులల్ని కూడబెట్టుకున్న సదరు అధికారికి మామూళ్ళపై మక్కువతో పదవి ఉండగానే రూ.కోట్లు సంపాదించాలనే ప్లాన్‌లో ఉన్న సదరు అధికారి నిర్మాణ అనుమతులకు ఓ రేటు ఆక్యూపెన్సీ పత్రాల జారీకి మరో రేటు వెలకట్టి అక్రమంగా సంపాదిస్తూ తన జేబుల్లో వేసుకుంటున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బహుళంతస్తుల భవన నిర్మాణాల అనుమతులను సకాలంలో ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారులు సిటీ ప్లానర్ కార్యాలయం చుట్టూ తమ కాళ్ళ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి భవన నిర్మాణల అనుమతికి అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే నిర్ణీత వ్యవధిలో అనుమతులు ఇవ్వాలి. కాని ఇదంతా కాగితాలు, ప్రకటనలకే పరిమితం. అడిగినన్నీ మామూళ్ళు ఇవ్వకుంటే అనుమతులు రాని పరిస్థితి ఇక్కడ నెలకొంది. నిర్మాణ అనుమతులకు పెద్ద మొత్తంలో మామూళ్ళను డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. గత కొంత కాలంగా నిర్మాణ అనుమతుల్లో విపరీతమైన జాప్యానికి ఇదే కారణం స్పష్టమవుతోం ది. నిర్దేశిత రుసుము చెల్లిస్తారు. సాధారణంగా ఇవన్నీ సక్రమంగానే ఉంటాయి. కాబట్టి నిర్ణీత గడువులోగా భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలి. ఓ అధికారి నిర్మాణ అనుమతుల్లో తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అన్నీ పత్రాలు సక్రమంగానే ఉన్నప్పటికీ అనుమతి ఎందుకు ఇవ్వడంలేదని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. ఎందుకు పర్మిషన్ ఇవ్వడంలేదని సదరు అధికారితోపాటు కార్యాలయ సిబ్బందిని ప్రశ్నిస్తే ఏదో ఒకటి కొర్రీ చూపుతూ బ్రోకర్ల సాయంతో దరఖాస్తు దారుల నుంచి లక్షల్లో మామూళ్ళను వసూళ్ళు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ఒక్కో భవనానికి రూ.20లక్షలకు పైగానే..**

**ఈ కార్యాలయంలో మామూళ్ళ రేట్లు..**

అక్రమ వసూళ్ళలో కొత్త రికార్డులు సృష్టిస్తోన్న కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ), విజిలెన్స్ విభాగాల నిఘా పెంచినా అవినీతి ఏ మాత్రం తగ్గకపోగా రోజు రోజుకు పెరుగుతోంది. కూకట్‌పల్లి, మాదాపూర్, కెపిహెచ్‌బికాలనీ, బాలాజీనగర్, హైదర్‌నగర్, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో నగరానికి ధీటుగా ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరుగడంతో బహుళంతస్తుల భవనాలు, కమర్షియల్ భవనాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. పెద్ద ఎత్తున బహుళంతస్తుల భవనాలు కొందరు అధికారులకు రూ.కోట్లు కురిపిస్తున్నాయి. ఇళ్ళ నిర్మాణంలో నిబంధనలల్ని పాటించడంలేదని సామాన్న మధ్య తరగతి ప్రజల్ని ముప్పుతిప్పలు పెట్టే అధికారులు నిబంధనల్ని పాటించని అనేక మంది బిల్డర్ల బహుళంతస్తుల భవనాల్ని నిర్మిస్తున్నా అదే విధంగా నిబంధనల్ని తుంగలో తొక్కి భవన నిర్మాణం పూర్తయిన భవనాలకు ఆక్యూపెన్సీ పత్రాలను జారీ చేస్తూ ఓ అధికారి రెండు చేతులా ఆర్జిస్తున్నాడన్న విమర్శలు పెరిగిపోయాయి. బహుళ అంతస్తుల భవనాల అనుమతులతోపాటు ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ల జారీకి ఒక్కో భవనానికి రూ.20 లక్షల నుంచి 30 లక్షలకు పైగానే ముడుపులు తీసుకుంటున్నట్లు సదరు అధికారిపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి.

## విఖ్యాత గాయకుడు ఘంటసాలకు గిఫ్ట్ స్వర నివాళి


గాయని గాయకులను సత్కరిస్తున్న వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు

**చిక్కడపల్లి ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :**

విఖ్యాత గాయకుడు ఘంటసాల 52 వ వర్ధంతి సందర్భం గా వంశీ సంస్థల ఘంటసాల ఇంటర్నేషనల్ ట్రస్ట్ (గిఫ్ట్) నిర్వాహణలో నాలుగు వేదికలు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక తో పాటు కళా మారుతి కళా వేదిక, గుండవరపు హనుమంత కళా వేదిక కళా దీక్షితులు కళా వేదిక పై నలభై రెండు మంది ప్రముఖ వర్ధమాన ప్రవర్ధమాన గాయనీ గాయకులు పద్దెనిమిది గంటల పాటు తమ గానం తో స్వర నివాళి అర్పించారు. వీరిలో వై ఎస్ రామకృష్ణ బృందం వి ఆర్ కె ఫణి బృందం రామ్ కుమార్ బృందం జ్యోతిర్మయి బొమ్ము బృందం అలనాటి నాటి ఘంటసాల సోలో పాటల్తో పాటు ఇతర గాయనీ గాయకుల తో పాటు పాడిన పాటలు మధురం గా ఆలపించారు. చంద్ర శేఖర్ వై ( అమెరికా) గంటి రామ కృష్ణ కె వి రావు శారదా రెడ్డి కమలశాస్త్రి, రేణుకా రమేష్ స్వర కళ్యాణి రామ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భం గా వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు మాట్లాడుతూ అమెరికాలో పదునాలుగు సార్లు ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహించాము అని చెప్పారు తెలుగు విశ్వవిద్యాలయం లో ఘంటసాల వంశీ స్వర్ణ పతకం ఏర్పాటు చేసి ప్రతి ఏటా సంగీతం లో ప్రథమ శ్రేణి విద్యార్థికి స్వర్ణ పతకం బహుకరణ జరుగుతోంది అని తెలిపారు సుధామయి వ్యాఖ్యానం చేసిన కార్యక్రమం కు వంశీ మేనేజింగ్ ట్రస్ట్ సుంకర పల్లి శైలజ పర్యవేక్షణ చేశారు ఈ సందర్భంగా కుంట్లూర్ లోని వంశీ వేగ్నేష ఆశ్రమం లో వున్న ఘంటసాల దేవాలయం లో పూజలు నిర్వహించారు

## సాహిత్యమే సమాజానికి చైతన్య స్ఫూర్తి : జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త**


శేరసం ఆద్వర్యంలో కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, పాల్గొన్న సాహితీవేత్తలు

సాహిత్యమే సమాజ చైతన్య స్ఫూర్తియని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి రచయితల సంఘం ఆద్వర్యంలో చందానగర్‌లోని సరస్వతి విద్యామందిర్‌లో శేరసం ద్వితీయ వార్షికోత్సవం, కవిసమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర గనుల శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి.డి. రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ హాజరై ప్రసంగించారు. సమాజాన్ని చైతన్యవంతం చేయటంలో కవుల పాత్ర కీలకమైనదని అన్నారు. జ్ఞానపీఠ్‌అవార్డు గ్రహీతలైన విశ్వనాథ సత్యనారాయణ, సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ్ వంటి ప్రముఖులు నేటి కవులకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ఆస్తులు కూడబెట్టినా రాని మానసిక ప్రశాంతత సాహిత్య గ్రంథ పఠనం ద్వారా సిద్దిస్తుందన్నారు. తెలియని సంగతులను అక్షరం నేర్పిస్తుందని ఆయన అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని కవులు, కళాకారులను ఒక వేదికపైకి తీసుకువచ్చి తెలుగు భాషా, సాహిత్యాల మనుగడకు కృషిచేస్తున్న శేరిలింగంపల్లి రచయితల సంఘం నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం రాష్ట్ర గనుల శాఖ విశ్రాంత డెరెక్టర్ వీ.డీ. రాజగోపాల్,ప్రముఖ కవి, విమర్శకులు గంటా మనోహర్‌రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, అంజనీకుమారి, రామస్వామియాదవ్‌లు మాట్లాడారు. మనిషిని కదలించేది,నడిపించేది కవిత్వమేనన్నారు. కవులు అనాధికర శాసనకర్తలని వారు అభివర్ణించారు. ఈ సందర్భంగా ఇస్లామిక్ సాహిత్య వేదిక ప్రతినిధి అబ్దుల్ రషీద్ సంకలనకర్తగా ప్రచురించిన కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సభా కార్యక్రమానికి శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షులు మోటూరి నారాయణరావు సమన్వయకర్తగావ్యవహరించగా, శేరసం ఉపాధ్యక్షులు జేవీ కుమార్ చేపూరి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌బాబు అరవా,భీమశ్రీనివాన్ రావు, విశ్వనాథ రెడ్డి , చంద్రశేఖర్‌రావులు కవిసమ్మేళన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలోసీనియర్ కాంగ్రెస్ నాయకులు సునీతరెడ్డి, ప్రీతం, కట్ల చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్ ముదిరాజ్,కవులు డాక్టర్ రమ్య స్వరూప్,కొలచన విజయభారతి పాల్గొన్నారు.

## గాంధీనగర్ డివిజన్ సమగ్రాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం : పావని వినయ్ కుమార్


గాంధీనగర్ తాజా మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి ఫిబ్రవరి 11 ( ప్రభాతవార్త ) :** అధికారికంగా 5 సంవత్సరాల కార్పొరేటర్ పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ఎ. పావని వినయ్ కుమార్ ను స్థానిక బుధవారం వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. బిజెపి సీనియర్ నాయకులు రత్న సాయి చంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు పాల్గొని అభినందనలు తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌ను అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ చేసిన కృషిని నాయకులు ప్రశంసించారు. ప్రజ ల సమస్యల పరిష్కారంలో ఆమె చూపిన చిత్తశుద్ధి, పట్టుదల అభినందనీయమని పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆమె చేసిన సేవలు విశేషమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ గారు, డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్ గారు, నాయకులు శ్రీకాంత్, దామోదర్, ఎం. ఉమేష్, సత్తి రెడ్డి, ప్రకాష్ యాదవ్, సురేష్ రాజు, ఆనంద్ రావు, శ్రీనివాస్ యాదవ్, సాయి కుమార్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ సమగ్రాభివృద్ధికి మార్గదర్శకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ : బండారు దత్తాత్రేయ


పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:** దేశ సమగ్రాభివృద్ధికి మార్గదర్శకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. బుధవారం దీన్ దయాళ్ ఉపాధ్యాయ 58వ వర్ధంతి సందర్భంగా గోల్నాకలోని ఆరవ నెంబర్ క్రాస్‌రోడ్డులో శ్రీ భవాని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ప్రధాన కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్ నేతృత్వంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా దత్తాత్రేయ హాజరై ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయజీ నిజమైన జాతీయవాది అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ఆధారంగా చేసుకుని దేశ నిర్మాణానికి అవసరమైన దిశను చూపించిన మహత్తర తాత్వికుడు అని కొనియాడారు. ఏకాత్మ మానవతా సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, వ్యక్తి–సమాజం–రాష్ట్రం పరస్పర అనుసంధానంతో ముందుకు సాగాలనే ఆదర్శాన్ని దేశానికి అందించారని గుర్తు చేశారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయజీ మహత్తర సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కర్రి రవీందర్, ఎం.అరుణ్‌కుమార్, ఏ.బసవరాజ్, ఏ.ఉపేంద్ర, ఎం.సత్యనారాయణ, కే.స్వామి, జి.వంశీకృష్ణ, సీహెచ్.వేణుగోపాల్, ఎం.స్వప్నప్రియ, శ్రీనివాస్, కొండ రవి, కే.కృష్ణ బీజేపీ నాయకులు శ్రీధర్‌గౌడ్, కేసరి నరిసంగరావుయాదవ్, ఈ.అజయ్‌కుమార్, ఎం.శ్యాంరాజు, కే.రమేష్‌యాదవ్, వనం రమేష్, జగన్, నాగరాజుచారి, ధనుంజయ, ఈశ్వర్‌రావు, టి.రాము, సావిత్రి గోపాల్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా నదిలో ఈదిన చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


కృష్ణా నది క్రాసింగ్‌లో 1.5.కి.మీ.ల దూరం ఈదిన చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్ డివిజన్‌కు చెందిన ఇద్దరు పదేళ్లలోపు చిన్నారులు కృష్ణానది క్రాసింగ్‌లో 1.5.కిలో మీటర్ల దూరం ఇది అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు. బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆ చిన్నారులు విధీసింగ్(8), యువాన్ మెహతా(10)లను అభినందించి, భవిష్యత్తులో ఈత పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని, మన ప్రాంతానికి మంచి కీర్తి,ప్రతిష్టలు తీసుకు రావాలని ఆశీర్వదించారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను పుస్తకాల పురుగుల్లా మార్చవద్దని, చదువులతో పాటు వారికి ఇష్టమైన ఆటలను గుర్తించి, శిక్షణ ఇప్పించి ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కొక్కరిలో ఒక్కో రకమైన ప్రతిభ ఉంటుందని, దాన్ని వెలికి తీసి సానబెడితే అధ్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. పదేళ్లలోపు చిన్నారులు కోచ్ ఆనంద రాయుడు సమక్షంలో చాలా ధైర్యంతో కృష్ణా నదిలో ఈదారని తెలిపారు. ఈ చిన్నారులు మునుముందు స్విమ్మింగ్‌లో గొప్ప క్రీడాకారులుగా ఎదుగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, నాయకులు గోకరి సురేష్‌గౌడ్, క్యాతం పాపయ్య యాదవ్, రజాక్, సాధిక్, నదీం తదితరులు పాల్గొన్నారు.

## అధికార దుర్వినియోగానికి పాల్పడిన కాంగ్రెస్

**-బిఆర్ఎస్ నాయకులు ఆర్వీ ఆరోపణ**


మాట్లాడుతున్న గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆర్వీమహేందర్

**గోషామహల్,ఫిబ్రవరి 11ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించడంతోపాటు మున్సిపల్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్,ఉద్యమనేత ఆర్వీమహేందర్‌కుమార్ ఆరోపించారు.బుధవారం కోఠిలోని పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్‌నాయకులు,ఉద్యమ నాయకులు జి.యాదగిరి,రమేష్‌లతో కలిసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు దాటినప్పటికి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలతోపాటు ఆరు గ్యారెంటీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలం చెందినట్లు దుయ్యబట్టారు.వృద్దులకు పెన్షన్లు,రైతులకు రైతుబంధు,తులం బంగారం,నిరుద్యోగభృతి ఎక్కడికి పోయాయి అన్ని ప్రశ్నించారు.బుధవారం జరిగినజరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోలీసులు అతి ఉత్సాహం ప్రదర్శించడం పట్ల అగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు.ఈ సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

## ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ సీతయ్యకు ఎక్స్‌ట్రా మైల్ అవార్డు



**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ జోన్, ఫలక్‌నుమా సబ్ డివిజన్, ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య తన ఉత్తమ పనితీరుతో 'ఎక్స్‌ట్రా మైల్ అవార్డు'ను అందుకున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికం మొత్తం పనితీరులో ఇన్‌స్పెక్టర్ సీతయ్య సాధించిన అద్భుతమైన విజయాలకు, వృత్తిపరమైన ప్రవర్తన, ప్రజా భద్రత పట్ల అంకితభావం, సామాజిక సేవలను ప్రశంసిస్తూ హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ చేతుల మీదుగా ఈ ప్రశంసా పత్రాన్ని, రూ.రెండు వేల నగదు పురస్కారాన్ని స్వీకరించారు. స్టేషన్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని అభిలషించారు.

## పదవుల కోసం ప్రజలను మోసం చేయటం తగునా : మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి

**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త**


చందానగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు

బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి పదవులు అనుభవించి అధికారం మారగానే నైతికవిలువలు వదలి నమ్ముకున్న ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ నేత, చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ధ్వజమెత్తారు. శేరిలింగంపల్లి నియోజక వర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆద్వర్యంలో చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ప్రజాస్వామ్యానికి పునాదైన భారత రాజ్యాంగాన్ని అవహేస్యం చేస్తూ గెలిపించిన ప్రజలకు, పార్టీకి వెన్నుపోటు పొడిచిన కార్పొరేటర్లకు జ్ఞానోదయం కలగాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాజ్యాంగం రాసిన అంబేద్కరుని సాక్షిగా రాజ్యాంగ స్ఫూర్తి చంపేసిన ఫిరాయింపు దారులను ప్రజలు రాబోయే ఎన్నికలలో ఓటుద్వారా శిక్షించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాలు నవతారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి రెండేళ్ల పదవిని అనుభవించి, అధికారం మారగానే నైతిక విలువలను వదిలేసి కాంగ్రెస్ గూటికి చేరటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పార్టీ ఫిరాయింపుల నిరోదక చటాన్ని తుంగలో తొక్కారన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు తమ పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ ఫిరాయిచటమంటే పరోక్షంగా రాజ్యాంగాన్ని అవమానించటమే అవుతుందన్నారు. స్వలాభం కోసం జంపింగ్‌లు జరిగాయని, ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు. నేటితో కార్పొరేటర్ల పదవీకాలం ముగిసిందని, రేపటి నుంచి కార్పొరేటర్లు మాజీలేనని, మళ్లీ ఓట్లు అడగటానికి ఏముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వెళతారని దుయ్యబట్టారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తించిన మాజీలకు రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అధికారం శాశ్వతం కాదని, నమ్ముకున్న సిద్దాంతం, నిలబడ్డ విలువలెప్పుడూ చరిత్రలో నిలిచిపోతాయని, ఫిరాయింపు ప్రజాప్రతినిధులు చరిత్రహీనులుగా మిగిలిపోతారని స్థానికనాకులు ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నయన మనోహరం చెన్నకేశవుని రథోత్సవం



చాంద్రాయణగుట్ట పురవీధుల్లో లక్ష్మీచెన్నకేశవుల రథయాత్ర

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన స్వయంభుః లక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం మంగళవారం రాత్రి గుట్ట పురవీధుల్ల నయనమనోహరంగా సాగింది. శ్రీశైలం ప్రధాన రోడ్డుపై గల రథశాల నుండి ప్రారంభమైన రథయాత్ర మంగళ వాయిద్యాలు, భాజా భజంత్రీల మధ్య చాంద్రాయణగుట్ట వై జెంక్షన్, గాంధీ విగ్రహం, చాంద్రాయణగుట్ట చౌరస్తా, శ్రీ కనక దుర్గ దేవాలయం, కుమ్మర్‌వాడి మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది.భక్తుల జేజేధ్వనాల మధ్య సాగిన రథోత్సవంలో బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు ఎ.మహేష్ గౌడ్, ఎ.శ్రీధర్, కె.శైలేష్,బి.వందన, ఆర్.విజయలక్ష్మి, బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన గురువారం చక్రతీర్థం, పుష్పయాగం, ధ్వజావరోహణం, మహాదాశీర్వచనం, తీర్థప్రసాద వినియోగం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.


ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు గాజుల శ్రీధర్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ ఈవో పోమ్యానాయక్, ఐఎఎస్ రామ్మోహన్‌లు

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనండి

**- సిఐటియు జిల్లా నాయకులు చంద్రశేఖర్**

**నిజాంపేట్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

బాచుపల్లి పారిశ్రామిక ప్రాంతంలో 12వ తేదీ జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పారిశ్రామిక ప్రాంతా సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ, నిరసన కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా ఎలక్ట్రిసిటీ ఉద్యోగులతో సిఐటియు జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ బాచుపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె జయప్రదం కావాలని కోరారు. 12 ఫిబ్రవరి జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని ప్రచార కార్యక్రమం, నిరసన కార్యక్రమాలు సమావేశాలు నిర్వహించామన్నారు. ముఖ్యంగా విద్యుత్ సవరణ బిల్లు 2023 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి లేబర్ కోడ్స్ రద్దు చేసే విధంగా, విద్యుత్ సవరణ బిల్లు 2023 రద్దు చేసే విధంగా, ఉపాధి హామీ పథకాన్ని పథకాన్ని పునరుద్ధరించే విధంగా అందరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు నాయకులు, కార్యకర్తలు కృపసాగర్, పవన్, రోహన్, రాజు, కళ్యాణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు ఆత్మవిశ్వాసాలను పెంచుతాయి




**హైదరాబాద్ ఫిబ్రవరి11,ప్రభాతవార్త :**

క్రీడలు మనోధైర్యాన్ని సంకల్ప బలాన్ని ఆత్మవిశ్వాసాలను పెంచుతాయని తెలంగాణ విద్యార్థి వికాస చైర్మన్ వేముల రామకృష్ణ పేర్కొన్నారు.రాజేంద్రనగర్ హరి హర క్షేత్రం మైదానంలో గత మూడు రోజులుగా క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి.పలు ప్రాంతాల నుంచి 33 జట్లు పాల్గొన్నాయి.మొదటి విజేతగా రాజేంద్రనగర్ కు చెందిన పీకే టీం, రెండో విజేతగా బుద్వేల్ టీం నిలిచాయి. విజేతలకు వేముల రామకృష్ణ బహుమతులతో పాటు నగదు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఈ శ్రీకాంత్, సాయి కిరణ్ యాదవ్, ప్రసాద్, సంతోష్, బాలు, ప్రణయ్, చేతన్, అమన్ ,పాపి తదితరులు పాల్గొన్నారు

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయకు ఘననివాళి



**అత్తాపూర్ ఫిబ్రవరి11, ప్రభాతవార్త :**

హైదర్‌గూడ చౌరస్తాలో బిజెపి వ్యవస్థాపకులు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమాన్ని అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి జిల్లా సెక్రెటరీ కొమురయ్య,తదితరులు పూలమాలవేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కడెం సుధాకర్ రాజా శేఖర్ విజయ్ జయనంద్ రెడ్డి సిదేశ్వర్ రమేష్ కిరణ్ కృష్ణ రాజు ప్రధాన కార్యదర్శులు జగన్ పెంజర్ల వెంకట్ రెడ్డి విమల్ శర్మ శ్రీకాంత్ చారి రాము భరత్ సతీష్ హరి విజయ్ శివ విజయ స్వామి శ్రీధర్ రెడ్డి సుధాకర్ రెడ్డి శేఖర్ శెట్టి రాజు ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నిజాంపేట్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బాచుపల్లి ఏఈ ఏ.శశిధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ రాజీవ్ గాంధీ నగర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు రాజీవ్ గాంధీ నగర్, పూజిత లే అవుట్ ప్రాంతాలలో, అలాగే 11కేవీ కోకో కోలా ఫీడర్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సాయి అనురాగ్ కాలనీ, కావ్య అవెనూ కోకా కోలా ఇండస్ట్రీయల్ ఏరియా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.



హరీష్‌రావుకు పూల మొక్కను అందజేస్తున్న దృశ్యం

## యువతకు ఉద్యోగాలు కల్పించడానికే ఐటి టవర్ ఏర్పాటు చేశాం : మాజీ మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** సిద్దిపేట ప్రాంతంలోని యువతకు ఉద్యోగాలు కల్పించడానికి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కెసిఆర్ నాయకత్వంలో ఐటి టవర్ ఏర్పాటుచేసుకున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట ఐటి టవర్‌ను బుధవారం ఆయన సందర్శించి ఉద్యోగాలు చేస్తున్న యువతతో ముచ్చటించారు. ఐటి టవర్‌లో సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను యువత హరీష్‌రావు దృష్టికి తీసుకవచ్చారు. వెంటనే ఆయన స్పందిస్తూ తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. సిద్దిపేట ఐటి టవర్‌లో 17 కంపెనీలు, 350 మంది యువత ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. సిద్దిపేటలో టాస్క్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేశామని టాస్క్ సెంటర్‌లో నిరంతరం ట్రైనింగ్ జరుగుతుందని చెప్పారు. ఐటి టవర్‌లోని నాలుగు ఫ్లోర్‌లు కలియతిరిగారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, కౌన్సిలర్ అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లాయిపల్లిలో బోర్ మోటర్ సీజ్



బోరు మోటర్ సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అల్లీపూర్ రెవెన్యూ పరిధిలోని ఎల్లాయిపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ సర్వే నంబరు 889లో రైతు బోరువేసి మోటర్ బిగించారు. చెలుకలపల్లి గ్రామానికి చెందిన కొంత మంది మాదిగ కులస్తులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు విచారణ చేసి బోరు మోటరు బుధవారం సీజ్‌చేశారు. గతంలో ప్రభుత్వ మాకు పట్టా సర్టిఫికెట్లు మంజూరు చేసిందని వారు పేర్కొన్నారు. చిన్నకోడూరు ఆర్ఐ మల్లికార్జున్, విఆర్ఎలు శ్రీనివాసు, మధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ తదితరులు

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండల పరిధిలోని కమ్మర్లపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ రేగుల శ్యామల దేవయ్య బుధవారం భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కప్పర శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు పిల్లి పవన్‌రాములు, కొట్టపల్లి విజయపర్శరాములు, యాదగిరి. నాయకులు నముండ్ల హరీష్, నముండ్ల వినోద్, కుమార్ పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ సేకరణ కేంద్రం ప్రారంభం



ఆయిల్‌ఫామ్ గెలల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

**మర్కుక్, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లిలో బుధవారం ఆయిల్‌ఫామ్ గెలల సేకరణ కేంద్రాన్ని సర్పంచ్ కవిత రాం మోహన్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కేంద్రంలో మర్కుక్, వర్గల్, గజ్వేల్, ములుగు, జగదేవ్‌పూర్ మండలాలకు చెందిన రైతులు పండించిన ఆయిల్‌ఫామ్ గెలలను సేకరించి నిల్వ చేయనున్నారు. నేటి నుంచి రైతులకు ఈ కేంద్రం అందుబాటులోకి వచ్చిందని ఆయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ భాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రాము తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ రాములు, హార్టికల్చర్ ఆఫీసర్ సౌమ్య, ఫీల్డ్ ఆఫీసర్లు విజయ్, తులసి, ఉపసర్పంచ్ సబిత కరుణాకర్, రైతులు సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్, రాజిరెడ్డి, నాయకులు బిక్షపతి పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో 84.21 ఓటింగ్ నమోదు

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎన్నికలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ఉదయం 7 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో మొత్తం 84.21 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అధికారిక గణాంకాల ప్రకారం మొత్తం 16,192 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 7,916, మహిళలు 8,272, ఇతరులు నలుగురు ఉన్నారు. పురుషులతో పోలిస్తే మహిళలు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం. ఉదయం నుంచే పట్టణంలోని పలు వార్డుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువత, మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎక్కడా పెద్దగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించారు. కొన్ని చోట్ల స్వల్ప సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించారు. మొత్తంగా హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో నమోదైన అధిక పోలింగ్ శాతం ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నదని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



ఓటుహక్కును వినియోగించుకునేందుకు వెళ్తున్న వృద్ధురాలు

# మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

**పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, సిపి రష్మీ పెరుమాళ్**

**ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసిపి ఆధ్వర్యంలో బందోబస్తు**

**గజ్వేల్/గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. మున్సిపాలిటీ పరిధిలోని మహతి విద్యానికేతన్ హైస్కూల్, బిఎంఆర్ డిగ్రీ కళాశాల, మైనార్టీ వెల్ఫేర్ కంప్యూటర్ సెంటర్, సెట్విన్ శిక్షణ సంస్థతో పాటు పలు పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హైమావతి, సిద్దిపేటజిల్లా సిపి రష్మీపెరుమాళ్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. మున్సిపల్‌లో మొత్తం 71 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఏసిపి నర్సింలు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలలో ఉన్న ఓటర్లకు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. పురుషులు 22,738, మహిళలు 24,001, ఇతరులు 1 కాగా మొత్తం 46,740 ఓటర్లు ఉండగా పురుషులు 18,102, మహిళలు 18,985, ఇతరులు 1 మొత్తం 37,088 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 79.35 శాతం ఓటింగ్ జరిగిందని అధికారులు తెలిపారు. సాయంత్రం ఓటింగ్ సరళి ముగిసిన తర్వాత రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం ప్రతీది చెక్ చేసుకొని బ్యాలెట్ బాక్స్ లాక్, సీల్ వేసి రూట్ ఆఫీసర్ ద్వారా పోలీస్ ఎస్కార్ట్ మధ్య రిసెప్షన్ సెంటర్‌కు తరలించారు. అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్‌లో భద్రపరచడంతోపాటు బందోబస్తును ఏర్పాటు చేశారు. విధులను ముగించుకున్న పోలింగ్ సిబ్బందిని వారి స్వగృహాలకు తరలించడానికి రూట్‌ల వారీగా బస్సు సౌకర్యం కల్పించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, తహసీల్దార్ శ్రావణ్ తదితరులు ఉన్నారు.

**చేర్యాలలో 83.41 శాతం నమోదు...**

**చేర్యాల, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** చేర్యాలలోని మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపాలిటీలో 12 వార్డులుండగా బూత్‌లు 24 ఏర్పాటు చేశారు. దీంతో బుధవారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరారు.

వృద్ధులు, దివ్యాంగులు, యువ కులు, మహిళలు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు భారీఎత్తున బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలవరకు 83.41 శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం. 13,777 ఓట్లు ఉండగా, 11,491 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 5626, మహిళలు 5865 తమ ఓటు హక్కును వినయోగించుకున్నారు.

**ఓటుహక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే...**

జనగామ నియోజకవర్గ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, చిన్న కుమారుడు రాకేష్‌రెడ్డి పట్టణంలోని 7వ వార్డులో ఉన్న తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ఓటింగ్ సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్...**

చేర్యాల పట్టణంలో జరుగుతున్న మున్సిపల్ ఓటింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి బుధవారం పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దమ్మగడ్డ, పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కో ఎడ్యుకేషన్))లోని పోలింగ్ స్టేషన్‌లలోని ఓటింగ్ సరళిని పరిశీలించారు. కొన్ని కేంద్రాలలో వైద్య శిబిరం, బిఎల్‌వో స్లిప్ పంపిణీ పోలింగ్ కేంద్రం లోపల ఉండడం చూసి వారిపై ఆగ్రహం వ్యక్తంచేసి, పోలింగ్ కేంద్రం బయట మార్చాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏసిపి వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ నాగేందర్, తహసీల్దారు దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.





గజ్వేల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి, పక్కన వివరాలు తెలుసుకుంటున్న సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్

# చేయి తడిపితేనే ఫైలు కదలిక..!

**-అవినీతికి కేరాఫ్ కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ కార్యాలయం..**

**-నిర్మాణాలకు అనుమతులు, ఆక్యుపెన్సీకి రూ.కోట్లలో మామూళ్లు..**

**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, జనవరి 11 ప్రభాతవవార్త:** కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ కార్యాలయం అవినీతికి, అక్రమార్జనకు నిలయంగా మారింది. ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ అధికారి అవినీతికి కేరాఫ్ అ డ్రస్‌గా మారారు. రూ. లక్షలు ఖర్చుపెట్టి ఇక్కడ సీటు దక్కించుకున్న సదరు అధికారి వడ్డీతో సహా సంపాదిం చడమే లక్ష్యంగా పెట్టుకుని అక్రమార్జనలో కొత్తపుంతలు తొక్కుతూ రూ.కోట్ల మామూళ్ళను తన జేబుల్లో వేసుకుంటున్నట్లు ఆరోపణలు వున్నాయి. అక్రమాలతో రూ. కోట్ల ఆస్తులల్ని కూడబెట్టుకున్న సదరు అధికారికి మామూళ్ళపై మక్కువతో పదవి ఉండగానే రూ.కోట్లు సంపాదించాలనే ప్లాన్‌లో ఉన్న సదరు అధికారి నిర్మాణ అనుమతులకు ఓ రేటు ఆక్యుపెన్సీ పత్రాల జారీకి మరో రేటు వెలకట్టి అక్రమంగా సంపాదిస్తూ తన జే బుల్లో వేసుకుంటున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బహుళ అంతస్తుల భవన నిర్మాణాల అనుమతులను సకాలంలో ఇవ్వకపోవడంతో దరఖాస్తు దారులు సిటీ ప్లానర్ కార్యాలయం చుట్టూ తమ కాళ్ళ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి భవన నిర్మాణల అనుమతికి అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే నిర్ణీత వ్యవధిలో అనుమతులు ఇవ్వాలి. కాని ఇదంతా కాగితాలు, ప్రకటనలకే పరిమితం. అడిగినన్నీ మామూళ్ళు ఇవ్వకుంటే అనుమతులు రాని పరిస్థితి ఇక్కడ నెలకొంది. నిర్మాణ అనుమతులకు పెద్దమొత్తంలో మామూళ్ళను డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. కొంత కాలంగా



జోనల్ కార్యాలయం

నిర్మాణ అనుమతుల్లో విపరీతమైన జాప్యానికి ఇదే కారణం స్పష్టమవుతోంది. నిర్దేశిత రుసుము చెల్లిస్తారు. సాధారణంగా ఇవన్నీ సక్ర మంగానే ఉంటాయి. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలి. ఓ అధికారి నిర్మాణ అనుమతుల్లో తనఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అన్నీ పత్రాలు సక్రమంగానే ఉన్నప్పటికీ అనుమతి ఎందుకు ఇవ్వడంలేదని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. ఎందుకు పర్మిషన్ ఇవ్వడంలేదని సదరు అధికారి తోపాటు కార్యా లయ సిబ్బందిని ప్రశ్నిస్తే ఏదో ఒకటి కొర్రీ చూపుతూ బ్రోకర్ల సాయంతో దరఖాస్తు దారుల నుంచి లక్షల్లో మా మూళ్ళను వసూళ్ళు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ఒక్కో భవనానికి రూ.20లక్షలకు పైగానే..**

**ఈ కార్యాలయంలో మామూళ్ళ రేట్లు..**

అక్రమ వసూళ్ళలో కొత్త రికార్డులు సృష్టిస్తోన్న కూకట్ పల్లి జోన్ సిటీ ప్లానర్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ), విజిలెన్స్ విభాగాల నిఘా పెంచినా అవినీ తి ఏ మాత్రం తగ్గకపోగా రోజు రోజుకు పెరుగుతోంది. కూకట్‌పల్లి, మాదాపూర్, కెపిహెచ్‌బికాలనీ, బాలాజీనగర్, హైదర్‌నగర్, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో నగరానికి ధీటుగా ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరుగడంతో బహుళంతస్తుల భవనాలు, కమర్షియల్ భవనాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. పెద్ద ఎత్తున బహుళంతస్తుల భవనాలు కొందరు అధికారులకు రూ.కోట్లు కురిపిస్తున్నాయి. ఇళ్ళ నిర్మాణంలో నిబంధనలల్ని పాటించడంలేదని సామా న్య మధ్య తరగతి ప్రజల్ని ముప్పుతిప్పలు పెట్టే అధికారులు నిబంధనల్ని పాటించని అనేక మంది బిల్డర్ల బహుళంతస్తుల భవనాల్ని నిర్మిస్తున్నా అదేవిధంగా నిబంధనల్ని తుంగలో తొక్కి భవన నిర్మాణం పూర్తయిన భవనాలకు ఆక్యూపెన్సీ పత్రాలను జారీ చేస్తూ ఓ అధికారి రెండు చేతులా ఆర్జిస్తున్నాడన్న విమర్శలు పెరిగిపోయాయి. బహుళ అంతస్తుల భవనాల అను మతులతోపాటు ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ల జారీకి ఒక్కో భవనానికి రూ.20 లక్షల నుంచి 30 లక్షలకు పైగానే ముడుపులు తీసుకుంటున్నట్లు సదరు అధికారిపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి.

## మహాశివరాత్రికి వివేక్ నగర్ ఆంజనేయస్వామి సిద్ధం

**చిక్కడపల్లి ఫిబ్రవరి 11 ( ప్రభాతవార్త ) :** మహాశివరాత్రి పర్వది నోత్సవాన్ని పురస్కరించుకుని వివేక్ నగర్ ఆంజనేయస్వామి దేవస్థానములో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూ జా కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవ నాదం బుధవారం వివరించారు. పదిహేనవ తేదీన ఉదయం ఆరు గంటలకు మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకములు, ఉద యం తొమిదిన్నర నుండి ఒంటిగంట ముప్పై వరకు ఏకవార రుద్రాభిషేకములు, సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి ఎనిమిదిన్నర ఏకవార రుద్రాభిషేకములు, రాత్రి పది గంటలకు సామూహికంగా మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకములు ఉంటాయని వివరించారు. రాత్రి ఒంటి గంటకు శివపార్వతుల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించబడుతుందన్నారు. భ క్తులందరూ ఈ విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృప కు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు బు గ్గా లక్ష్మీ ప్రవతి శర్మ, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ చెల్లించాలి : జిల్లపల్లి అంజీ

**సైఫాబాద్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** ఇంజనీరింగ్, ఎంబిఎ, ఎంసి ఎ, పిజీ, డిగ్రీ కోర్సులు చేసే లక్షలాది మంది విద్యార్థులకు తక్షణ మే 8 వేల కోట్ల ఫీజుల బకాయిల చెల్లించాలని బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజీ డిమాండ్ చేశారు. కోర్సు లు పూర్తి చేసిన విద్యార్థులు పై చదువులకు వెళ్ళాలంటే ప్రభుత్వం నుంచి ఫీజులు పెండింగ్‌లో ఉండటం వల్ల కళాశాలల యాజమా న్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. దీంతో అనేక మంది విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే ప్రభుత్వం ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వి డుదల చేసి విద్యార్థులను అదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్లాస్టిక్ రహిత సమాజం కలేనా...!?

**గాల్లో కలుస్తున్న ప్లాస్టిక్ నిబంధనలు ...!? మంత్రి ఆశయానికి గండి.. ప్రజల ఆరోగ్యానికి ముప్పు..కొరవడిన అధికారుల పర్యవేక్షణ**

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పలు చర్యలు చేపట్టినప్పటికీ, అవి అమలులో విఫలమవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మంత్రి తండ్రి పేరుతో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసి, మహిళా సంఘాలకు ఉచితంగా స్టీల్ పాత్రలు పంపిణీ చేయడం విశేషం. అంతేకాకుండా పట్టణంలోని హోటళ్లకూ ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లకు బదులుగా వినియోగించేందుకు ప్రత్యామ్నాయ సామగ్రిని అందించారు. అయితే ఈ చర్యలు కేవలం కార్యక్రమాలకే పరిమితమయ్యాయని, హోటల్ నిర్వాహకులు యథేచ్ఛగా ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు ఉపయోగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నప్పటికీ, లాభాల కోసం కొందరు వ్యాపారులు నిబంధనలను పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల హుస్నాబాద్ మార్కెట్ యార్డులో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమంలోనూ కొందరు ప్లాస్టిక్ వినియోగించిన ఘటనపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ తాటి మల్లిఖార్జున్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి



పేపర్ గ్లాస్‌లో చాయ్ పోస్తున్న హోటల్ నిర్వాహకులు

రెడ్డిలకు మంత్రి స్వయంగా ఐదువేల రూపాయల చొప్పున జరిమానా విధించి, ప్లాస్టిక్ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. అయినప్పటికీ, అధికార యంత్రాంగం స్పందనలో నిర్లక్ష్యం కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పర్యవేక్షణ లోపం, అమలు దౌర్బల్యం కారణంగా మళ్లీ పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి ముప్పుగా మారుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడంలో అధికారులు చురుకుదనం చూపకపోతే, మంత్రి చేపట్టిన చర్యలు ఫలితం లేకుండా పోతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల ఆరోగ్యం కాపాడాలంటే కేవలం ప్రకటనలు, జరిమానాలు సరిపోవని, నిరంతర తనిఖీలు, కఠిన చర్యలు అవసరమని ప్రజలు సూచిస్తున్నారు. హుస్నాబాద్‌ను ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాలు అమలులో సఫలీకృతం కావాలంటే, ప్రజలతో పాటు వ్యాపారులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



ఇరుపార్టీల కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

## రామాయంపేటలో స్వల్ప ఉద్రిక్తత

**85 శాతం పోలింగ్....**

**రామాయంపేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలో బుధవారం జరిగిన రెండవ సాధారణ ఎన్నికలలో 85 శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం 12 వార్డులకు గాను 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 13095 ఓటర్లకు గాను 11వేల 110 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. ఉదయం కొంత మందకొడిగా సాగిన పోలింగ్, 11 గంటలకల్లా వేగం పుంజుకుంది. పట్టణంలోని ఆయా వార్డులలో చెదురు ముదురు సంఘటనలు, స్వల్ప ఉద్రిక్తల మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ముఖ్యంగా 1వ వార్డులో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య ఘర్షణ జరగగా, ఏడవ వార్డులో కాంగ్రెస్-బిజెపి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు ఆందోళనకారులను చెదరకొడుతూ ఎప్పటికప్పుడు పరిస్థితులను చక్కబెట్టారు.

**తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత...**

ప్రజాస్వామ్యానికి, దేశానికి, సమాజానికి మార్పు సాధించాలన్న ఆశయంతో మున్సిపల్ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తొలిసారి ఓటు వేసిన మర్కు శ్రీనిధి పేర్కొంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందని, ఇది కేవలం ఓటు హక్కు వినియోగించడమే కాదు, యువతకు దేశం, సమాజంపై ఉన్న తాము బాధ్యత వహించాలి అనే మానసికతను పెంపొందించడమే అని తెలిపింది.

## మానవత్వానికి ప్రతిరూపం - హెడ్ కానిస్టేబుల్ సేవా హస్తం

**జిన్నారం ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** జిన్నారం మున్సిపాలిటీ రాల కత్వ పోలింగ్ స్టేషన్‌లో మున్సిపల్ ఎన్నికల విధుల్లో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సాయిలు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వృద్ధురాలు / అంగవైకల్యం గల మహిళ నడవలేని స్థితిలో ఉండటాన్ని గమనించిన సాయిలు, తక్షణమే స్పందించి ఆమెకు చేయూతనిచ్చారు. పోలింగ్ బూత్ వరకు స్వయంగా తోడుగా తీసుకెళ్లి, ఆమె ఓటు హక్కును నిర్బంధం లేకుండా వినియోగించుకునేలా పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన చూపిన మానవీయత, సేవాభావం అక్కడ ఉన్న ఓటర్లను కదిలించింది. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదే అన్న సందేశాన్ని తన చర్యల ద్వారా చాటిన హెడ్ కానిస్టేబుల్ సాయిలు, పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచారు. ఎన్నికల విధుల్లో కఠినత్వంతో పాటు, మానవత్వాన్ని కలిపి చూపిన ఈ సంఘటన అందరికీ ఆదర్శంగా నిలిచింది.

**సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు**

## విజయవంతం చేయాలి : భాస్కర్‌నాయక్

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** ఈ నెల 20వ తేదీన లంబాడి హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న శూర్‌వీర్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోతు భాస్కర్‌నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం హుస్నాబాద్‌లో ఆయన మాట్లాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా బంజారా సంఘాలు సిద్ధమవుతున్నాయని, జయంతి సందర్భంగా పలు ముఖ్యమైన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 15ను శూర్‌వీర్ సేవాలాల్ మహారాజ్ జయంతిగా జాతీయ సెలవు దినంగా ప్రకటించి, దేశవ్యాప్తంగా ఉత్సవాల నిర్వహణకు రూ.100 కోట్లు కేటాయించాలని, పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సేవాలాల్‌మహారాజ్ ప్రతిమను ఏర్పాటు చేయాలని, బంజారా సమాజానికి చెందిన గోర్‌బోలి(భాష)ను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, వివిధ రాష్ట్రాల్లోఉన్న ఎస్‌సి, బిసి, ఎన్‌టి, డిఎన్‌టి, జెవిఎన్‌టి కేటగిరీలలో ఉన్న బంజారాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో బంజారా సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## గుజరాత్, చెన్నై నుంచి వచ్చి ఓటు వేసిన యువతులు



**చేర్యాల, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన పుట్టకావేరి రాజుల ఇద్దరు కూతుళ్లు పై చదువుల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఈ సందర్భంగా చేర్యాలలో మున్సిపల్ ఎన్నికలు జరుగు తున్న నేపథ్యంలో పట్టణానికి వచ్చి వారి ఓటు హక్కును వినియోగించుకు న్నారు. పెద్ద కూతూరు బింధు గుజరాత్ రాష్ట్రంలో పీజీ సెకండియర్, చిన్నకూతురు సింధు చెన్నైలో బయోమెడికల్ థర్డ్ ఇయర్ చదువుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు ఎంతో అమూల్య మైందన్నారు. అంతే కాకుండా మొదటిసారి ఓటు హక్కును వినియోగించు కోవడం చాల సంతోషంగా ఉందని వారు తెలిపారు.

**మానవత్వానికి ప్రతిరూపం - హెడ్ కానిస్టేబుల్ సేవా హస్తం**

**జిన్నారం ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :** జిన్నారం మున్సిపాలిటీ రాల కత్వ పోలింగ్ స్టేషన్‌లో మున్సిపల్ ఎన్నికల విధుల్లో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సాయిలు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఓటు హక్కును నియోగించుకోవడానికి వచ్చిన వృద్ధురాలు / అంగవైకల్యం గల మహిళ నడవలేని స్థితిలో ఉండటాన్ని గమనించిన సాయిలు, తక్షణమే స్పందించి ఆమెకు చేయూతనిచ్చారు. పోలింగ్ బూత్ వరకు స్వయంగా తోడుగా తీసుకెళ్లి, ఆమె ఓటు హక్కును నిర్బంధం లేకుండా వినియోగించుకునేలా పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన చూపిన మానవీయత, సేవాభావం అక్కడ ఉన్న ఓటర్లను కదిలించింది. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదే అన్న సందేశాన్ని తన చర్యల ద్వారా చాటిన హెడ్ కానిస్టేబుల్ సాయిలు, పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచారు. ఎన్నికల విధుల్లో కఠినత్వంతో పాటు, మానవత్వాన్ని కలిపి చూపిన ఈ సంఘటన అందరికీ ఆదర్శంగా నిలిచింది.

**ఎంక్వైరీ నోటీస్**

తేది: 11.02.2026

వీరికి
శ్రీ మహమ్మద్ తౌఫీక్
ఇ.నెం.: 501205,
డిపార్ట్‌మెంట్ : డ్యూయల్ ట్యూబర్-II, ఎంఆర్‌ఎఫ్ లిమిటెడ్, మెదక్ ప్లాంట్ R/o.ఇం.నం. 3-8-35/24 ఫయాజ్‌నగర్, దర్గా దగ్గర, మోమిన్‌పేట రోడ్, సదాశివపేట, జిల్లా: సంగారెడ్డి-502291, రాష్ట్రం : తెలంగాణ.

విషయం : విచారణ యొక్క ప్రకటన

రిఫరెన్స్ : (1) విచారణ యొక్క ప్రకటన తేదీ 04-02-2026.
(2) ఎంక్వైరీ ప్రొసీడింగ్స్ తేది: 07.02.2026

04.02.2026 తేదీ గల ఎంక్వైరీ నోటీస్, హోటల్ సత్య ఇన్, రూమ్ నం.: 105, అశోక్‌నగర్, ఆర్.సి.పురం, హైదరాబాద్-32 వద్ద 07.02.2026న ఉ.10.00గం. వద్ద ఫిక్స్ చేయబడిన షెడ్యూల్ ఆఫ్ ఎంక్వైరీ గురించి తెలియచేస్తూ, రికార్డ్‌లో, వున్న మీ నివాసిత చిరునామాకు స్పీడ్ పోస్ట్ ద్వారా పంపబడినట్లు స్పష్టమవుతోంది. తపాలా అథారిటీ వారు "సూచనలు లేకుండా వదిలి వెళ్లారనే" రిమార్క్‌లతో తిప్పి పంపారు. అందుచేత మీరు విచారణకు హాజరు కావటం విఫలమయ్యారు.

మీకు ఒక న్యాయమైన మరియు సహేతుకమైన అవకాశం ఇవ్వటానికి పైన పేర్కొన్న అదే స్థలం మరియు సమయంలో, అనగా రూమ్ నం.: 105, హోటల్ సత్య ఇన్, అశోక్‌నగర్, ఆర్.సి.పురం, హైదరాబాద్-32 వద్ద 16.02.2026న ఉ.10.00గం.కు ఎంక్వైరీ వాయిదా వేయబడింది.

అందువలన మీరు సదరు నిర్దేశిత సమయం, తేదీ మరియు ఎంక్వైరీ యొక్క స్థలం వద్ద విచారణకు హాజరు కావలసివున్నది. మరియు అన్ని అవకాశాలు ఉపయోగించుకొనటం ద్వారా మీ కేస్‌ని మీరు సమర్థించుకోవడానికి న్యాయం రుజువు చేసుకోనవచ్చును. ఎంక్వైరీలో మీ కేస్ మీరు సమర్థించుకోవటానికి మీరు యాజమాన్యపు సాక్షులను క్రాస్ ఎగ్జామినింగ్ చేయడానికి చాలినంతగా అవకాశం ఇవ్వబడుతుంది. మరియు మీ తరపున మీ స్వంత సాక్షులను కూడా పరీక్షించుకోనవచ్చును. మీరు ఆ విధంగా కోరుకుంటే, ఎంక్వైరీలో మీరు ఏ సహ-ఉద్యోగి సహాయమును ఉపయోగించుకోవచ్చు మరియు బయట వ్యక్తులు అనుమతింపబడరు.

ఎంక్వైరీకి హాజరుకావటానికి మీకు సాధ్యం అవటానికి యిది ఫైనల్ అవకాశంగా మీకు ప్రత్యేకంగా, ఇందుమూలముగా తెలియచేయడ మైనది. మరియు పైన పేర్కొనబడిన విధంగా ఎంక్వైరీకి హాజరు కావడం మీరు విఫలమైతే ఎంక్వైరీ ప్రొసీడింగ్స్ ఎక్స్-పార్టీగా నిర్వర్తించబడ తాయి మరియు అట్టి ప్రొసీడింగ్స్ మీపై కట్టుబడి ఉంటాయి.

సం/-. డి.విజయకృష్ణ మోహన్
ఎంక్వైరీ ఆఫీసర్

## గాణగాపూర్‌కు చేరుకున్న పాదయాత్ర

**మనూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన మనూర్‌తోపాటు ఆయాగ్రామాల నుంచి ఈ నెల 6వ తారీఖున మహారాష్ట్రలోని గాణగాపూర్‌లో కొలువుండి భక్తులచే నిత్యపూజలందుకుంటున్న దత్తాత్రేయుడి సన్నిధికి పాదయాత్రగా బయలుదేరిన భక్తులు బుధవారం గాణగాపూర్ పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. గాణగాపూర్‌లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దత్తాత్రేయుడిని దర్శించుకున్నారు. మండలం నుంచి 3వమారు గాణగాపూర్‌కు పాదయాత్రగా చేరుకున్నట్లు పాదయాత్ర భక్తులు పేర్కొన్నారు.

## వరసిద్ధివినాయకుడిని దర్శించుకున్న శివస్వాములు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

శివమాల ధరించి నియమనిష్ఠలతో పరమశివుడిని పూజిస్తున్న శివస్వాములు బుధవారం మండలపరిధిలోని హద్నూర్ గ్రామంలో కొలువున్న స్వయంభూ వరసిద్ధివినాయకుడిని దర్శించుకుని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. హద్నూర్‌గ్రామానికి చెందిన శివస్వాములు ఆలయంలో ఉంటూ నిత్యం పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆలయ ఆవరణలో మహాపడిపూజ కార్యక్రమాన్ని సైతం మండల పరిధిలోని శివస్వాములతో కలిసి చేపట్టారు. గ్రామం సుభిక్షంగా ఉండాలంటూ శివమాల ధరించినట్లు శివస్వాములు పేర్కొన్నారు.

## గరిడేగావ్‌లో సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



సిసిరోడ్డు నిర్మాణానికి శ్రీకారంచుడుతున్న సర్పంచి నగేష్‌యాదవ్

**సిర్గాపూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గరిడేగావ్ గ్రామంలో బుధవారం సిసి రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ నగేష్ యాదవ్ భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నగేష్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి హామిని అమలు చేసి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రమేష్‌ముదిరాజ్, మర్రి నారాయణ, భూంగొండ, సుభాష్ యాదవ్, పండరి రాజు, నర్సగొండ తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఓటుతో ప్రజాస్వామ్య పండుగకు నాంది

**-గుమ్మడిదల యువతకు స్ఫూర్తిగా నిలిచిన బెజగం సాక్షిత్**

**గుమ్మడిదల, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో మొట్టమొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్న యువకుడు బెజగం సాక్షిత్ ప్రజాస్వామ్య పండుగకు నూతన ఉత్సాహాన్ని నింపారు. తొలి ఓటువేయడం తనజీవితంలో గర్వకారణమైన క్షణమని పేర్కొంటూ, ఈ అనుభూతిని ప్రతి యువకుడు అనుభవించాలని ఆకాంక్షించారు. తొలి ఓటుతోనే ప్రజాస్వామ్యంపై తన ప్రేమనుచాటిన బెజగం సాక్షిత్, గుమ్మడిదల యువతకు ఆదర్శంగా నిలిచి, ఓటు ప్రాధాన్యతను చాటిచెప్పారు. ఈసంఘటన గుమ్మడిదలలో యువతలో కొత్త చైతన్యాన్ని, ఉత్సాహాన్ని రగిలించింది.

## ఖేడ్‌లో 72.64శాతం పోలింగ్ నమోదు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్‌లో గురువారం పురపాలక ఎన్నికల్లో మొత్తం 15 వార్డులగాను, 30 పోలింగ్ కేంద్రాల్లో కలిపి 17,675 ఓటర్లగాను 72.64శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల అధికారి వెల్లడించారు. పదిహేను వార్డుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఆయన అన్నారు. అన్ని పోలింగ్‌కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా సిబ్బందితో అన్ని సదుపాయాలను ఏర్పాటుచేశామన్నారు.

## ఏడుపాయల వనదుర్గ భవానీమాతను దర్శించుకున్న మెదక్ ఎమ్మెల్యే

**పాపన్నపేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త ః**

ప్రసిద్ధ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవాని మాతను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్‌రావు దర్శించుకున్నారు. బుధవారం ఆయన ఏడుపాయలకు చేరుకోగా ఆలయ అధికారులు పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన వనదుర్గ భవాని మాతను దర్శించుకుని ప్రత్యేక అర్చన పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ పూజారులు ఆశీర్వదించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ సిబ్బంది శాలువాతో సత్కరించారు. వారి వెంట మహేష్ గౌడ్, నాసాన్పల్లి ఉపసర్పంచ్ సిరాజ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న బిజెపి జిల్లా అధ్యక్షులు



ఓటువేసిన వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్, కుటుంబసభ్యులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి నర్సాపూర్ పట్టణంలో 10 వార్డుకు సంబంధించిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు మన హక్కు, ఓటు వెయ్యడం మన భాద్యత ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్ కోరారు,

## ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలను పరిశీలించిన పిడి



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న గృహనిర్మాణశాఖ పిడి మాణిక్యం

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ముస్లాపూర్‌లో లబ్దిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గృహనిర్మాణశాఖ పిడి మాణిక్యం పరిశీలించారు. ఈ సందర్భంగా పిడి మాణిక్యం మాట్లాడుతూ మెదక్ జిల్లాలో 9209 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు, 1434 గృహాల్లో గృహ ప్రవేశాలు కూడా జరిగాయన్నారు. 6287 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. 5040మంది లబ్దిదారులకు 100 కోట్ల రూపాయలను సైతం అందచేయడం జరిగిందన్నారు. లబ్దిదారుల నుంచి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే 8712032717, 18005995991కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రసన్న, మాజీ ఉపసర్పంచి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు అడుగులు ఎటు..?

## అంతుచిక్కని ఓటర్ నాడీ...

## ఆందోళనలో అభ్యర్థులు..

## ఓటు ఎవరికి సామీ..?



**నారాయణఖేడ్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ పట్టణంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 15వార్డుల్లో అధికార కాంగ్రెస్‌పార్టీ నుండి 15మంది, బిఆర్‌ఎస్‌పార్టీ నుండి 15మంది, బిజెపినుండి 15మంది అభ్యర్థులతోపాటు ఆయాపార్టీలకు చెందిన మొత్తం 57మంది ఖేడ్ పురపాలికలలో బరిలో నిలిచారు. బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడగడానికి ఇంటికి వచ్చిన ప్రతి అభ్యర్థికి ఓటర్లు అన్నా మా ఓటు మీకే అని హామీ ఇస్తున్నారు. నిన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు అభ్యర్థులను నిరుత్సాహ పరచకుండా అన్నా మీకు కాకుంటే ఓటు ఇంకెవరికిస్తామే, అక్క మా ఓటు మీకే అని ఏ పార్టీ అభ్యర్థి ఇంటికి వెళ్లినా ఓటర్ మహాశయులు మాత్రం ఇదే సమాధానం చెప్పారు. దీంతో అభ్యర్థులు ఓటు అటా? ఇటా? అని ఎటూ తెలియని అయోమయస్థితిలో ఉన్నారు.

ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు పడరానిపాట్లు పడ్డప్పటికీ, ఎక్కడ ఓట్లు వేస్తారు అనే అర్థంగాని పరిస్థితి ఏర్పడింది. ఓటర్లను అభ్యర్థులు స్వయంగా అడగడమే కాకుండా ఎవరితోనైతే వింటారో వారిద్వారా సైతం చెప్పించే ప్రయత్నం చేసినప్పటికీ, ఏ అభ్యర్థి వచ్చినా, అందరికీ ఓటు వేస్తామనే హామీ ఇస్తున్నారు. గెలుపు కోసం ప్రతి అభ్యర్థి ఒకటి నుంచి ఆరుసార్లు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసినప్పటికీ, ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా అందరికీ అదే సమాధానం రావటంతో అభ్యర్థులు ఓటర్ నాడి అర్థంకాక అయోమయానికి గురవుతున్నారు. బ్యాలెట్ పై ఓటు వేసే చివరినిమిషం వరకు ఎవరికి ఓటేస్తారో..కాటేస్తారో.. అనే విషయంపై ఎవరికీ అంతుపట్టని పరిస్థితి ఏర్పడింది. ఇక అదృష్టం ఎవరిపరం కానుందో బ్యాలెట్ పేపర్ తెరిచిన తర్వాత కాని తెలియదు..

## ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపి

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ పట్టణంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ షెట్కార్ నారాయణఖేడ్ పట్టణంలోగల నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాలలో తమ కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేటట్లు అందరూ సహకరించాలని ప్రజలతో వేడుకున్నారు. వారివెంట ఉమ్మడి జిల్లా ప్రణాళికాసంఘం సభ్యులు, ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి నగేష్‌కుమార్ షెట్కార్, వారి సోదరుడి కుమారుడు ఏడవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సాగర్ షెట్కార్, ఎంపి తనయుడు రాకేష్‌కుమార్ షెట్కార్, కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

నారాయణ ఖేడ్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా తొమ్మిదో వార్డులో ప్రభుత్వ ఉన్నత బాలికలపాఠశాలలో బుధవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి కుటుంబీకులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా 2వ వార్డులో ఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## సదాశివపేట మున్సిపాలిటీలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జనరల్ అబ్జర్వర్

**సదాశివపేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

సదాశివపేట పట్టణంలోని రవీంద్ర మోడల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రాన్ని జనరల్ అబ్జర్వర్ ఉదయ్‌కుమార్ మంగళవారం సందర్శించి పోలింగ్ ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లు, సౌకర్యాలు, భద్రతాచర్యలు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్‌కేంద్రంలో ఏర్పాటుచేసిన ఓటరు హెల్ప్‌డెస్క్, ఓటర్ జాబితాలు, పోలింగ్‌బూత్‌ల అమరిక, ఓటింగ్ కంపార్ట్మెంట్, తాగు నీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తంచేశారు. పోలింగ్ సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్నివిభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

## పోలింగ్ సరళిని పరిశీలించిన మాజీమంత్రి



పోలింగ్ సరళిపై ఆరాతీస్తున్న మాజీమంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం పట్టణంలో జరిగిన ఎన్నికల సరళిని మాజీమంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని 1,2,3,4,5,17,18,19, 20,26,33,36,37 పోలింగ్‌బూత్‌లను కాంగ్రెస్ నాయకులతోకలిసి సందర్శించి అభ్యర్థుల ద్వారా పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

## ఖేడ్‌లో ప్రశాంతంగా ఎన్నికలు

**-డిఎస్పి వెంకటరెడ్డి**



మాట్లాడుతున్న పోలీసులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్‌లో మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 15 వార్డులకుగాను, 12 లొకేషన్లలో ఎన్నికలు సజావుగా జరిగాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయని నారాయణఖేడ్ డిఎస్‌పి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎన్నికలు జరిగే కేంద్రాలను వారు సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటుచేశామన్నారు. పట్టణంలో అన్ని పోలింగ్‌కేంద్రాల్లో తమసిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా అన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయనతోపాటు నారాయణఖేడ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సబ్‌ఇన్స్పెక్టర్స్ ఆఫ్ పోలీస్ రావుల శ్రీశైలం, దుర్గారెడ్డి, రవీందర్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.

## నర్సాపూర్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

**-నర్సాపూర్‌లో 78.61 శాతం పోలింగ్**

**-పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా అదనపు ఎస్పి**



ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

**నర్సాపూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15 వార్డులు ఉండగా ఆరు ప్రాంతాల్లో ఈ వార్డులకు 30 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ఈ 15 వార్డుల్లో మొత్తం కలిపి 16,876 ఓటర్లుండగా ఇందులో 13,266 మంది తమ ఓటు హక్కును వినియోంచుకోగా ఇందులో మహిళలు 6804 కాగా 6461 మంది పురుషులు, ఇతరులు ఒకరు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో 78.61 శాతం పోలింగ్ నమోదయిందని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికల సరళిని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్‌రెడ్డి, తూప్రాన్ డిఎస్పి నరేందర్‌గౌడ్‌లు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డితోపాటు పోలీసులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎవ్వరినీ పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ ఎన్నికల్లో నర్సాపూర్‌లో చెదురుమదురు సంఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు 15వ వార్డులో ఇరుపార్టీలవారికి వాదోపవాదాలు జరిగాయి. ఇంకా పలువార్డుల్లో చిన్నచిన్న సంఘటనలు జరిగినా పోలీసులు అప్రమత్తమై సద్దుమణిగించారు. ఈ మేరకు నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సజావుగా సాగింది. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గొడవలు జరగకుండా నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు...**

నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు మన హక్కు, ఓటు వెయ్యడం మన బాధ్యత ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.

## మున్సిపాలిటీల్లో వందశాతం ఓటింగ్ జరగాలి

**-సెలవురోజు అని కాలక్షేపం చేయకుండా బాధ్యతగా ఓటు వేయాలి**

**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్**





పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**రామాయంపేట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

బాధ్యతగా మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం రామాయంపేట మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద శాతం ఓటింగ్ జరగాలని, సెలవు రోజు కాలక్షేపం చేయకుండా బాధ్యతగా ఓటు వేయాలన్నారు. భారత ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన ఓటు అందరికీ సమానంగా ఉంటుందన్నారు. దేశ రాష్ట్రపతికైనా, సామాన్య వ్యక్తికైనా సమానమైన ఓటు హక్కును భారత రాజ్యాంగం కల్పించిందని స్పష్టం చేశారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా అర్బన్ ఓటర్ నిజాయితీగా, నిక్కచ్చిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 148 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలలో సిసిటివి కెమెరాలు వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టరేట్ కార్యాలయం పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుండి పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మెదక్ జిల్లాలోని మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీలలో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ రజనికుమారి, ప్రత్యేక ఎన్నికల అధికారి సాయిబాబాతోపాటు పలువురు అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి క్రీడాకారుల ఎంపిక..





రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

**చిలిపిచెడ్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

రాష్ట్రస్థాయిలో ఉత్తమప్రతిభను కనబరిచి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఉషు మెదక్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పూర్ణచందర్, ప్రధానకార్యదర్శి పోచయ్య ఆకాంక్షించారు. బుధవారం మండల కేంద్రమైన చిలిపిచెడ్, శీలంపల్లి గ్రామ శివారులోగల రైతువేదికలో సెకండ్ సీజన్ సిఎం కప్ క్రీడాపోటీల్లో భాగంగా జిల్లాస్థాయి ఉషు మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారుల ఎంపికలను నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన పలు మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమప్రతిభ కనబరిచి పలువురు ప్రథమస్థానంలో నిలిచారు. ప్రథమస్థానంలో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 20 నుంచి 22 వరకు హైదరాబాద్ పట్టణంలోగల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సెకండ్ సీజన్ సిఎం కప్ పోటీలలో పాల్గొననున్నారని ఈసందర్భంగా వారు తెలిపారు. మాస్టర్లు నవీన్, రాజు, షాదుల్లా, మహేష్‌గౌడ్, హరిప్రసాద్, నవనీత తదితరులు పాల్గొన్నారు.

## యూత్ అండర్21 వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

**గుమ్మడిదల, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

తెలంగాణ 8వ అంతర్ జిల్లా వాలీబాల్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ యూత్ అండర్21 బాలుర, బాలికల టీం ఎంపికలు ఈ నెల 14న(శనివారం) గుమ్మడిదల ప్రాథమికపాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయిత పరంజ్యోతి, ఆర్.వెంకటేశ్వర్లు, పాల సాయిరాం, ప్రధాన కార్యదర్శులు కె.రవీందర్, ఎ.కృష్ణ, కె.రవీందర్‌రెడ్డిలు తెలిపారు. ఈమేరకు వారు ఆదివారం ఒక ప్రకటనను విడుదలచేశారు. వేములవాడలో జరగబోయే అంతర్‌జిల్లాల పోటీలకు ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 1 జనవరి, 2005 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. వారి వారి జన్మ ధ్రువపత్రాలు, ఆధార్ ఒరిజినల్, బోనఫైడ్, పదోతరగతి మెమో, ఒకసెట్ జిరాక్స్ ఉదయం 10.00గంటలకు క్రీడామైదానంలో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంప్రతించవలసిన మొబైల్ నంబర్స్ 9603431003, 9849109338, 8008384850.

## అంగన్‌వాడీల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలు

**-ఛైర్మన్‌గా సర్పంచి-సభ్యులుగా 11మంది**

**పుల్‌కల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

అంగన్‌వాడీల పర్యవేక్షణకు ఇక నుంచి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కమిటీకి ఛైర్మన్‌గా గ్రామ సర్పంచి, సభ్యులుగా 11 మందిని నియమించి పౌష్టికాహార పథకాలు పక్కదారి పట్టకుండా చూసేందుకు గ్రామ సర్పంచిని కమిటీ ఛైర్మన్‌గా 11మంది సభ్యులతో (పదవీవిరమణ పొందిన ఉద్యోగి, చిన్నారుల తల్లులు) ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీకి అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, ఎఎన్‌ఎం ప్రభుత్వపాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు బాధ్యతలు నిర్వహించనున్నారు. అంగన్‌వాడీకి సరఫరా అయ్యే బాలామృతం, గుడ్లు, పాలు, నిత్యావసర సరుకులు నాణ్యతగా ఉండేలా, ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న భోజనాన్ని ప్రత్యేక కమిటీ పర్యవేక్షణలో సరఫరాకానుంది. అంగన్‌వాడీల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీల నియామకంతో అంగన్‌వాడీలు బలోపేతం కావడం తథ్యమనే ప్రచారం మొదలయింది. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారంలో అక్రమాలకు ఇకనుంచి చెక్ తప్పదని గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు.

## హుస్నాబాద్‌లో ప్రజాస్వామ్య హత్య

**-కాంగ్రెస్ డబ్బుల రాజ్యం - పోలీసుల లాఠీ బిఆర్‌ఎస్‌పైనే**

**-హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**





మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగగా కాకుండా అధికార కాంగ్రెస్‌పార్టీ దౌర్జన్యానికి వేదికగా మారాయని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు ఓటర్లకు యథేచ్ఛగా నగదు పంచుతూ బహిరంగంగా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పోలీసులు కళ్లకుగంతలు కట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఏం చేసినా పట్టించుకోని పోలీసులు, ఫిర్యాదులు పేరుతో బిఆర్‌ఎస్ అభ్యర్థుల ఇళ్లపై దాడులుచేయడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా పోలీసుల పక్షపాత వైఖరి బహిర్గతమైందన్నారు. కాంగ్రెస్ నేతల డబ్బుల పంపిణీపై స్పందించని ఎన్నికలసంఘం, స్పెషల్ ఫోర్స్ అధికారులు, బిఆర్‌ఎస్‌ను మాత్రం లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడటం వెనుక ఎవరి ఆదేశాలు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఎన్నికలనిర్వహణా లేక అధికారపార్టీకి పోలీస్ రక్షణా అన్న ప్రశ్నలు హుస్నాబాద్ అంతటా మార్మోగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో పోలీస్ వ్యవస్థ తటస్థంగా ఉండాల్సిన అవసరం ఉండగా, అధికార పార్టీకి కొమ్ముకాస్తూ ప్రతిపక్షాన్ని అణిచే ప్రయత్నం చేయడం రాజ్యాంగవిరుద్ధమని మండిపడ్డారు. ఈ పరిస్థితి కొనసాగితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని బిఆర్‌ఎస్ నేతలు హెచ్చరించారు. ఏది ఏమైనా జరిగిన ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ అంటే అధికార పార్టీకి భయం మొదలైందని, తమ పార్టీ బలంగా ఉంది అనడానికి నిదర్శనమే తమ నాయకులపై పోలీసుల దౌర్జన్యమన్నారు. తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసిన పట్టణ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

## జర్నలిస్ట్ సుందర్‌రాజ్ మృతి తీరనిలోటు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

మండల ఆంధ్రజ్యోతి దిన పత్రిక విలేఖరి సుందర్‌రాజ్ మృతి పత్రికా రంగానికి తీరనిలోటని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. గత మూడు దశాబ్దాలుగా జర్నలిస్టుగా పనిచేస్తూ ప్రజల సమస్యలపరిష్కారంలో సుందర్‌రాజ్ కీలకపాత్ర పోషించారని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. జర్నలిస్టు సుందర్‌రాజ్ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే సానుభూతి తెలిపి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి సదుపాయాల అందజేత

**వర్గల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

ఎస్‌బిఐ పాన్ ఇండియా సిఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ములుగు ఎస్‌బిఐ బ్రాంచ్‌మేనేజర్ కన్యాకుమారి వర్గల్‌మండలం గౌరారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిత్ర హోలిస్టిక్ సొసైటీద్వారా అభివృద్ధిపనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులోభాగంగా గౌరారంలోని అంగన్వాడీకేంద్రానికి మౌలికసదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. చిన్నారులకు ఆటవస్తువులు, డ్రాయింగ్‌బుక్స్, ఆల్ఫాబెటికల్‌బుక్స్, స్పూన్స్, ప్లేట్స్, గ్లాసులు, స్కూల్‌బ్యాగులు, రైస్‌కుక్కర్, టివి, వాటర్‌ఫిల్టర్ తదితరవస్తువులను అందించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు భవాని, రాశి, సర్పంచి నగరం కనకరాజు, ఉపసర్పంచి వెల్దుర్తి శ్రీకాంత్, వార్డుసభ్యులు, అంగన్వాడీ టీచర్లు రమలీల, సంతోష, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.